www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 2 జూన్ 2023

వైవీయూ విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి-కడప అర్బన్
ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీలలో వైవీయూకు చెందిన విద్యార్థి రవిశంకర్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ బుద్ధ యూనివర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. కాంస్య పతకం సాధించిన విద్యార్థిని విసి సుధాకర్, రిజిస్టర్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ రామసుబ్బారెడ్డి అభినందించారు.

కాంస్య పతకంతో రవిశంకర్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎంపీ అవినాష్‌రెడ్డి

రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ

ప్రజాశక్తి - కడప అర్బన్
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో.. ప్రజలకు సంతృప్త స్థాయిలో ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో వైఎస్సార్ రైతు భరోసా వరుసగా ఐదవ సం. మొదటి విడతలో అర్హులైన అన్నదాతలకు బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విసి ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ సభాభవన్ హాలు నుండి కలెక్టర్ విజయ్ రామరాజు, జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ భరత్వాజ్, ఎంపీ అవినాష్‌రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హాజరయ్యారు. జిల్లాలో అర్హులైన అన్నదాతలకు 'రైతు భరోసా' సాయం కింద 2,05,600 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.154.871 కోట్లలకు సంబందించిన మెగా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో సంతృప్త స్థాయిలో అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధన దిశగా అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు.అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన 1369 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీ కింద రూ.1.67 కోట్ల సాయాన్ని అందించడం జరిగిందన్నారు.ప్రభుత్వం ద్వారా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఐదో ఏడాది తొలి విడత వైఎస్సార్ రైతు భరోసా నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడం నిజంగా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతే రాజు అనే పదానికి కొత్త నిర్వచనాన్నిస్తూ మన రాష్ట్రంలో అన్నదాతలకు సున్నా వడ్డీ రుణాలు, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీలను సంక్షేమ పథకాలు అమలులోభాగంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, రైతులు సంఘాల నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

బుగ్గవంకపై వంతెనలు నిర్మించాలి

నిరసనలో అఖిలపక్ష నాయకుల డిమాండ్

డిప్యూటీ సిఎం క్యాంప్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్
రవీంద్రనగర్ ప్రజల సౌకర్యార్థం బుగ్గవంకపై రెండు వంతెనలు నిర్మించాలని టిడిపి, సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, బుగ్గవంక వంతెనల సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డిప్యూటీ సిఎం క్యాంప్ కార్యాలయం ఎదుట కడప బుగ్గవంక వంతెనల సాధన కమిటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాధన కమిటీ కన్వీనర్ హమీద్, ఎన్ఆర్ జెఎసి కన్వీనర్ అహ్మద్, బాబుబాయ్, టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి హరిప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ మాట్లాడుతూ నగరంలో బుగ్గవంక పైన వంతెనల నిర్మాణం కోసం రూ.10 కోట్ల తీసుకురాలేని మంత్రి, ప్రజాసమస్యలపై స్పందించని మంత్రి తన పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని అత్యంత జనాభా కలిగిన దాదాపుగా 38 శాతం నగర ప్రజలు నివసించే మురాదియా నగర్, రవీంద్రనగర్, నబీకోట్, మరాఠీవీధి, చౌట్పల్లి, మరియాపురం, కాగితాలపెంట, బిల్టప్, రామరాజుపల్లె, ఆలంఖాన్‌పల్లె, తదితర ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న అత్యంత పురాతణమైన చారిత్రక వారధులుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలా గజిట్‌లో కూడా స్థానం పొందిన తాపల బ్రిడ్జిగా ప్రస్తుతం షామీరియా మసీదు బ్రిడ్జిగా పిలువబడే సదరు వంతెనను బుగ్గవంక పరివాహిక కాలువ ప్రాంతం రక్షణ గోడల నిర్మాణం పేరుతో ఆ బ్రిడ్జిని పూర్తిగా తొలగించి రక్షణ గోడలను అధికారులు నిర్మించారని పేర్కొన్నారు. ఫలితంగా సుమారు 200 సంవత్సరాల నాటి సదరు షామీరియా బ్రిడ్జిని తొలగించడం వల్ల ప్రజలు సర్వసాధారణంగా రాకపోకలు సాగించే స్థానికేతరులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అలాగే హజరత్ బాదుల్లా సాహెబ్ మకాన్ - పాత లా కాలేజికి మధ్య అనుసంధానంగా ఉన్న అత్యావశ్యకమైన బ్రిడ్జిని కూడా తొలగించి అధికార యంత్రాంగం అక్కడ పూర్తిగా రక్షణ గోడను నిర్మించారని పేర్కొన్నారు. ఫలితంగా రవీంద్రనగర్ కాగితాలపెంట, భాకరాపేట ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడానికి స్థానికేతరులు కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నగరానికి అత్యంత ప్రధానమైన ఈ రెండు బ్రిడ్జిలు లేకుండా చేయడం వల్ల నగరంలోని ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, అధికారుల స్పందించి బ్రిడ్జిల నిర్మాణానికి ముందుకు వచ్చి నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో నిర్మాణం కోసం స్థానిక ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఓబులేసు, చంద్రారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాయక్, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, బాదుల్లా, లక్ష్మి, బిఎస్‌పి గుర్రప్ప, ఎస్‌టిపిఐ జహంగీర్, ఎంఆర్ఎఫ్ దస్తగిరి, ఎఐవైఎఫ్ మల్లికార్జున, ఎఐఎస్ఎఫ్ సుబ్బరాయుడు, బుగ్గవంక వంతెనల సాధన కమిటీ నాయకులు ఖాజా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యువగళంతో వైసిపిలో వణుకు

- బహిరంగ సభలో నారా లోకేష్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్
యువగళం దెబ్బకి వైసిపి ఎమ్మెల్యేలు వణికిపోతున్నారన్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 113వ రోజుకు చేరుకుంది. గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌటపల్లి విడిది కేంద్రం నుంచి దొరసానిపల్లె, ఆర్ట్స్ కాలేజీ, వన్‌టౌన్ సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్, కొత్తపల్లి ఖాదర్‌బాద్, కొత్తపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో బుడగజంగాలు, యువత, చేనేతలు, స్థానికులు, క్రిష్టియన్లు, ఆర్యవైశ్యులు, ముస్లింములతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో హూ కిల్డ్ బాబాయ్ ప్లకార్డులు ప్రజలకి చూపించి బాబాయ్‌ని లేపేసింది ఎవరు అంటూ లోకేష్ ప్రజలను అడిగారు. వివేకాని మర్డర్ చేసింది అవినాష్, జగన్ అంటూ పెద్ద ఎత్తున ప్రజలు నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించకూడదంటూ టిడిపి కార్యకర్తలను డిఎస్‌పి నాగరాజు వారించారు. అన్ని అనుమతులు తీసుకొని పాదయాత్ర చేస్తున్నామని, మమ్మల్ని రెచ్చగొట్టేలా వైసిపి వాళ్ల ఫ్లెక్సీలు పెట్టినప్పుడు మీరు ఎక్కడ ఉన్నారంటూ డిఎస్‌పిని లోకేష్ ప్రశ్నించారు. అక్కడి నుండి పోలీసులు వెనుదిరిగిపోయారు. పాదయాత్ర సందర్భంగా శివాలయం సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ టిడిపి మ్యానిఫెస్టో దెబ్బకి వైసిపి నాయకుల మైండ్ బ్లాంక్ అయిందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రొద్దుటూరుని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తాడని రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ఆయన ప్రొద్దుటూరుని గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గుట్కా, దొంగనోట్లు, ఇసుక అక్రమ రవాణాకి అడ్డాగా మార్చారని విమర్శించారు. ఏకంగా సొంత ఇంటినే అసాంఘిక కార్యక్రమాలకు కేర్ ఆఫ్ అడ్రెస్‌గా మార్చుకున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత కారుకు ఇఎంఐ, అద్దె ఇంట్లో ఉన్న స్థితి నుండి ఇప్పుడు వేల కోట్ల అధిపతి అయ్యారనిమ పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు ప్రజలు గెలిపించిన ఎమ్మెల్యే ఒకరైతే నామినేటెడ్ ఎమ్మెల్యేలు మరో ఇద్దరని తెలిపారు. ఆర్‌బికె రాచమల్లు, బంగారు రెడ్డి, కిరణ్ రెడ్డి ఈ ముగ్గురు ప్రొద్దుటూరుని కేకులా కోసుకొని తినేస్తున్నారని విమర్శించారు. ఏడాదికి రూ.500 కోట్లు ఐదేళ్లలో రూ.2500 కోట్లతో ప్రొద్దుటూరు రూపురేఖలు మార్చేస్తానన్నారన్నారు. ఆయన రూపురేఖలు మారాయి అవినీతి సొమ్ముతో లావు అయ్యాడే తప్ప ప్రొద్దుటూరు రూపురేఖలు మారలేదన్నారు. పట్టుమని రూ.100 కోట్ల పనులు కూడా పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే అని పేర్కొన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు తీసుకోవద్దు వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే 2 సెంట్లలో ఒక్క రూపాయి తీసుకోకుండా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారని తెలిపారు. బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రజిని దొంగ నోట్లు చలామణి చేస్తూ కర్ణాటకలో పట్టుబడ్డారని, దీని వెనుక ఉన్న దొంగనోట్ల డాన్ బెట్టింగ్ ప్రసాద్ అని పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో ఏ వ్యాపారం చేసినా ఆయనకు కప్పం కట్టాల్సిందేనన్నారు. ఈయన దెబ్బకి వ్యాపారస్తులు అందరూ వణికిపోతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని చెప్పి, జాబ్‌లెస్ కేలండర్ విడుదల చేశారన్నారు. తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురైన 470 మంది యువతీ యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రూ.3 వేల నిరుద్యోగ భతి ప్రకటించారన్నారు. ముస్లిం మైనారిటీల ఆస్తులపై ఉన్న శ్రద్ధ వారి సంక్షేమంపై లేదన్నారు. మైనారిటీలకు చెందిన వేల కోట్ల రూపాయల వక్ఫ్ మసీదుల ఆస్తులను వైసిపి నేతలు దోచుకున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల నిధులను పక్కదారి పట్టించడంతో మున్సిపాలిటీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు నిధుల్లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీని వాసులురెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు

ప్రొద్దుటూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

బ్రిజ్ భూషణ్‌ను తక్షణం అరెస్టు చేయాలి

మాట్లాడుతున్న మనోహర్, నాగసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్
మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 50 రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున మాపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళ మల్లయోధులు పోరాడుతున్నారని పేర్కొన్నారు. 38 కేసుల్లో హత్య, కిడ్నాప్, అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్‌ని ఆర్ఎస్ఎస్, బిజెపి, మోడీ ప్రభుత్వం కాపాడుతూ దేశానికి ప్రతిష్ట తెచ్చిన మహిళా రెజ్లర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య పోరాడుతున్న మల్లయోధులకు మద్దతు తెలియజేస్తూ తక్షణం రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎన్నికలు తక్షణం నిర్వహించని పక్షంలో ప్రపంచ పోటీల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరిక చేయడాన్ని గుర్తుచేశారు. కార్పొరేట్ కనుసన్నల్లో నడిచే జాతీయ మీడియా మహిళా రెజ్లర్ల పోరాటాన్ని విస్మరించడం, మోడీ ప్రభుత్వానికి భయపడి ప్రసారం చేయకపోవడం భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని చేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో రైతులు కార్మికులు, విద్యార్థులు సంఘాలతో కలిసి ఉద ృత పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, సిఐటియు నగర కార్యదర్శి చంద్రారెడ్డి, నాయకులు పాపిరెడ్డి పాల్గొన్నారు.

కడప: మహిళ మల్లయోధులను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, జిల్లా మహిళా అధ్యక్షులు శ్యామల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బ్రిజ్ భూషణ్‌ను రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, ఎంపీ పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమీరా, మల్లికా బేగం, గౌరీ, బిసి సెల్ నాయకులు కోపూరు శ్రీనివాసులు, వేణుగోపాల్, గౌసు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : డిఆర్ఒ

కడప: ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో శనివారం నుండి 10వ తేదీ వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం ఆయన పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ముందస్తు ప్రణాళికతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ పాస్‌పోర్ట్, పాన్‌కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తీసుకెళ్లాలన్నారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో (సికె దిన్నె) నిర్వహించే ఈ పరీక్షలకు 414 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థులతో బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకొని పరీక్ష హాల్‌కు అనుమతిస్తారన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. టాయిలెట్స్, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు, గర్భిణులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పరీక్ష నిర్వహించేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుబడ్డ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లైజన్ అధికారి ఎఫ్ఎస్ఒ మల్లిఖార్జునరెడ్డి, ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారులు జి.అశోక్, కె.సురేష్ పాల్గొన్నారు.

తమ్మినేనిపై 307 కేసు నమోదు చేయాలి

కడప అర్బన్ : స్పీకర్ తమ్మినేని సీతారామ్ రాజ్యాంగ పదవిలో ఉండి చంద్రబాబు ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని, చర్యలు తీసుకోవాలని చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో కలుపుకుని 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా, 14 ఏళు ప్రతిపక్ష నేతగా, టిడిపి జాతీయ అధ్యక్షులుగా 40 ఏళ్ల అనుభావం ఉన్న నాయకుని భద్రత తీసేస్తే ఫినిష్ అని మాట్లాడడంతో చంద్రబాబుకు ప్రాణాలకు ఆపద చేసే విదంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తమ్మినేనిపై 307 సెక్షన్ కేసు నమోదు చేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్, నాయకులు అహమ్మద్, సుభాన్, చంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సుస్థిర స్థానం

కడప అర్బన్ : విధి నిర్వహణలో మనం అందించే ఉత్తమ సేవలతోనే మనకు ఉద్యోగుల హృదయాల్లో సుస్థిర స్థానం లభిస్తుందని ఆకాశవాణి, దూరదర్శన్ చెన్నై కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రంగస్వామి పేర్కొన్నారు. గురువారం కడప హరిత హోటల్ సమావేశ మందిరంలో జరిగిన కడప ఆకాశవాణి కేంద్రం ఇంజినీరింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శరత్ బాబు ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యక్తి అయినా తన ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే వారి సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. అలాంటి సేవలందించిన కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, శరత్ బాబు అభినందనీయులని ప్రశంసించారు. కడప డిప్యూటీ డైరెక్టర్ ఇంజనీరింగ్ వీరభద్రుడు మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారిని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి

- వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్
విశ్వవిద్యాలయ విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తానని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధానాచార్యులు ఆచార్య సామాను రఘునాథరెడ్డి అన్నారు. వైవీయూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులుగా ఆచార్య రఘునాథరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనను వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ చింత సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపి వెంకటసుబ్బయ్య, పూర్వపు ప్రధానాచార్యులు కె.కృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎంవి శంకర్ పుష్పగుచ్ఛం అందజేసే అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల అధిపతులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, సహ ఆచార్యులు, సహాయ ఆచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, బోధ నేతల సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు, విశ్వవిద్యాలయంలో ఉన్న వనరులు విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూస్తానన్నారు. వసతి గృహాల పరంగా విసి, రిజిస్ట్రార్‌ల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చూస్తామన్నారు. సాంకేతిక విధానాన్ని వినియోగించుకుని ఈ-పరిపాలనను సాగిస్తామన్నారు. విద్యార్థుల ఉద్యోగ అవకాశాల కోసం పరిశ్రమలతో అనుసంధానం అవుతామని తెలిపారు. అలానే పలు సంస్థల్లో ప్రాజెక్టుల నిర్వహణకు విద్యార్థులను తయారు చేస్తామన్నారు. ప్రఖ్యాత వ్యక్తుల ఉపన్యాసాలు, నైపుణ్యాలు, ఇన్నవేటివ్ థింకింగ్ విద్యార్థులకు అందేలా సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. జాతీయ విద్యా విధానం 20-20 అమలు చేయడం, అధ్యాపకుల సహకారంతో విద్యార్థుల బహుళ ప్రయోజనాల కోసం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

విద్యార్థులకు చక్కటి ఇంగ్లీష్ ఉచ్చారణ అవసరం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్
ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులకు చక్కటి ఇంగ్లీష్ అవగాహన, ఉచ్చారణ ఎంతో అవసరం అని ఇంగ్లీషు అధ్యాపకులు చిన్నయ్య విద్యార్థులకు సూచించారు. ఎఫ్ఎస్ఎఫ్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత సమ్మర్ స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్సెస్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఫాదర్ మనోహర్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థుల కొరకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో విజన్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పాపయ్య రాయపాటి,ఫాదర్ జీవన్, ఫిజికల్ డైరెక్టర్ ఆవులూరి గురయ్య, బాస్ స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ ఒద్దేపోగు యోహాన్, కాలిగ్రఫీ టీచర్ కుమారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్వస్థలానికి చేరిన పఠాన్ మృతదేహం

ప్రజాశక్తి-కడప
కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన పఠాన్ మౌలాఖాన్ మృతదేహాన్ని ఎపిఎన్ఆర్‌టిఎస్, మృతుడి స్నేహితుల సహకారంతో స్వస్థలం రాయచోటికి గురువారం చేరింది. జీవనోపాధి కోసం పఠాన్ పదేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లారు. ఆయన కుటుంబం కూడా కువైట్‌లోనే ఉంది. మూడు నెలల క్రితం ఆయన భార్య కాన్పుకు రాయచోటికి వచ్చింది. భర్తకు ఏప్రిల్ 14వ తేదీన గుండెపోటు రావడంతో ఆమె మే 25వ తేదీన కువైట్‌కు వెళ్లారు. 28వ తేదీన పఠాన్ గుండెపోటుతో మృతి చెందారు. వైసిపి వెల్ఫేర్ ఇన్‌ఛార్జి గోవింద రాజు సహకారంతో మృతుని స్నేహితులు మృతదేహాన్ని రాయచోటికి తీసుకువచ్చేందుకు 20 రోజులు పట్టింది. ఈ సందర్భంగా ఎపిఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్.ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కువైట్ ఎపిఎన్ఆర్‌టిఎస్ రీజినల్ కో-ఆర్డినేటర్ నాయని మహేష్ మాట్లాడుతూ పఠాన్ స్నేహితులు సూరపరాజు సుధాకర్ రాజు, వెల్లిగండ్ల శ్రీనివాసరాజు, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, సంగరాజు సుదర్శన్ రాజు, మచ్చ రమేష్ స్నేహ ధర్మానికి బాసటగా నిలిచి మానవత్వం చాటుకున్నారన్నారు.

పఠాన్ (ఫైల్ ఫొటో)

చెన్నూరు తహశీల్దార్‌గా సరస్వతి

ప్రజాశక్తి-చెన్నూరు
చెన్నూరు తహశీల్దారుగా టి.సరస్వతి గురువారం బాధ్యతలు చేపట్టారు. పులివెందులలో డిఎస్ఒగా పనిచేస్తూ బదిలీపై చెన్నూరుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ బదిలీలపై ఇక్కడికి వచ్చానన్నారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు.


తహశీల్దార్ సరస్వతి

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కడప
డిసిసి మాజీ అధ్యక్షులు మాకం అశోక్ కుమార్ తండ్రి మాకం మురళి 76వ జయంతిని పరిష్కరించుకుని గురువారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశల వసతి గృహంలో అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమం నిరాశల వసతిగృహం నిర్వాహకులు విజయబాబు, మల్లీ రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం చేస్తున్న మాకం అశోక్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

హాస్టళ్లలో శుచి, శుభ్రతతో వంటలు : కలెక్టర్

ప్రజాశక్తి-కడప
వంట చేయడంలో శుచి శుభ్రత పాటిస్తూ ప్రేమతో వండి పిల్లలకు వడ్డించడం ద్వారా మంచి పేరు తీసుకురావడంతో పాటు పిల్లల ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్తుకు కారకులు కావాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. గురువారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జిల్లాలోని సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమ హాస్టళ్లు, కెజిబివి, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేయుచున్న వంట వారికోసం శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కడప జిల్లాలో మహిళా, శిశు సంక్షేమానికి పనిచేయుచున్న ఆర్తి హోమ్ జిల్లా సాంఘిక సంక్షేమ విభాగం వారి సహకారంతో కడప జిల్లా సంక్షేమ హాస్టల్లో పనిచేయుచున్న వంట వారికోసం శిక్షణా శిబిరాన్ని జూన్ 1వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వంట చేయడంలో శుచి శుభ్రతతో, ప్రేమతో వండి పిల్లలకు వడ్డించడం ద్వారా మంచి పేరు తీసుకురావాలన్నారు. పిల్లల ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్తుకు కారకులు కావాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన వంట కార్మికులకు వత్తిలో నైపుణ్యం పెరిగేందుకు దోహద పడుతుందన్నారు. రాష్ట్రంలోనే మన జిల్లాలో మొదటి సారిగా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. శిక్షణాంతరం ఆప్రాన్స్‌తో పాటు వంటకు తోడ్పడే ఇతర పరికరాల్ని వంట కార్మికులకు అందజేస్తామని కలెక్టర్ అన్నారు. ఈ శిక్షణ శిబిరం నాలుగు బ్యాచులుగా 12 రోజులల్లో 640 మంది వంట కార్మికులకు శిక్షణలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వంట కార్మికులు సద్వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. అపార అనుభవం కలిగిన శ్రీధర్ రాజమాణిక్యం, సూర్య వివేక్ శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయ ప్రకాష్ ,ఆర్తి హోం సభ్యులు అరుణరెడ్డి , సునీల్ కాంత్ , ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభు పొడిపిరెడ్డి, కబీర్ అహ్మద్ పాల్గొన్నారు.

జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్
జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరిగే నేపథ్యంలో జిరాక్స్ సెంటర్లను అధికారులు మూసివేయించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరగా వున్న జిరాక్స్ సెంటర్లను అధికారులు మూసివేయించాలని పేర్కొన్నారు. గతంలో జిల్లాలో, రాష్ట్రంలో పేపర్ లీకేజీ విషయం జిల్లాని, రాష్ట్రాన్ని కుదిపేశాయని తెలిపారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్ల నుంచి లీకేజీ జరిగిన సంఘటనలు వున్నాయని పేర్కొన్నారు. కావున అధికారులు ఎలాంటివి పునరావృతం కాకుండా పరీక్షా కేంద్రాల వద్ద వున్న జిరాక్స్ సెంటర్లను పరీక్షలు జరిగే సమయాలలో మూసివేయించాలని తెలిపారు.

'ఉపాధి' ద్వారా ఆదాయ మార్గాలు

ప్రజాశక్తి - దువ్వూరు


మాట్లాడుతున్న ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి

మండలంలో ఎలాంటి సమస్యలు లేవని, రానున్న వర్షాకాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి కానాల జయ చంద్రారెడ్డి సూచిం చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల య సభాభవనంలో గురు వారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విలేజ్ క్లినిక్ ద్వారా రోగులకు సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల 9న గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు ఇస్తున్నామన్నారు. వెలుగు సిసి శ్రీధర్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. మండలంలో 966 గృహాలు మంజూరయ్యాయని, ఇందులో 476 పూర్తి చేశామన్నారు. 'ఉపాధి' ద్వారా సన్నచిన్న కారు రైతులకు ఆదాయం కల్పించే మార్గంగా ముందుకు సాగుతున్నామని ఎపిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మధ్యకాలంలో మండలంలో ఎక్కువ కరెంటు పోతోందని సభ్యులు సభ దృష్టికి తేగా, ఎఇ వీరారెడ్డి స్పందిస్తూ గతంలో వీచిన గాలులు, వర్షాలకు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, వాటి మరమ్మతుల్లో భాగంగా కరెంట్ తీశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ రైతు భరోసా నిధులు మంజూరు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం వైఎస్ఆర్ రైతు భరోసా నిధులు మంజూరు చేసినట్లు గురువారం వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,139 మంది రైతులకు రూ.3 కోట్ల 37 లక్షల 64వేల 500 మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో రైతుకు రూ.5,500 డిబిటి పద్ధతిలో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

4,877 మందికి రైతు భరోసా

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలానికి సంబంధించి వైయస్సార్ రైతు భరోసా కింద 4,877 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు ఎం చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులకు ఐదవ సంవత్సరం మొదటి విడతకుగాను రూ.3.674 కోట్లు వారి ఖాతాలో జమ చేశారన్నారు. ఒకొక్క రైతుకు రూ.5,500 వేశారన్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి - పెద్దముడియం

సమీక్షా సమావేశంలో అధికారులు

మండలంలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామని ఎఇ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురు వారం తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపిడిఒ వెంకటరమణ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఎఇ సుబ్బ రాయుడు మాట్లా డుతూ మండలంలో 519 ఇళ్లు మంజూరు కాగా, అవి పలు దశల్లో ఉన్నాయని తెలిపారు. 320 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఒక్క పెద్ద పసుపులలోనే అత్యధిక నిర్మాణాలు బేస్‌మెంట్ దశలో అగిపోయినట్లు తెలిపారు. వాటిని వెంటనే నిర్మాణం చేపట్టేలా లబ్ధిదారులతో మాట్లాడుతామన్నారు. సమావేశంలో ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎఇలు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు, అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ సన్యాసిరాజు

గణితంలో పట్టు సాధించాలి

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్‌కు చెందిన ఐఐటి డిపార్టుమెంటు ఆఫ్ మాథెమాటిక్స్ ప్రొఫెసర్ వై.వి.యస్.యస్. సన్యాసిరాజు మాట్లాడుతూ గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు మాథెమాటిక్స్‌లో డిఫెరెంట్ ఈక్వేషన్స్, అప్లికేషన్స్ వివరించారు. ఏరోనాటికల్, వేవ్ ఈక్వేషన్స్, స్ట్రింగ్ ఆఫ్ వైర్ అవసరం గురించి వివరించారు. స్థిరాంకాలు, ప్రమేయాలను తొలగించి పాక్షిక అవకలన సమీకరణాలను పరిష్కరించడం, రేఖా గణిత విధుల పరిష్కారాలను సాధించడం, ఉష్ణ సమీకరణం, తరంగ సమీకరణాల ఉపయోగం గురించి వివరించారు. తమ కళాశాల విద్యార్థులకు మాథెమాటిక్స్‌లో ఎన్నో అమూల్యమైన విషయాలను తెలియజేయడం పట్ల కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సన్యాసిరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మం నిలుస్తుంది..న్యాయం గెలుస్తుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

'ధర్మం నిలుస్తుంది-న్యాయం గెలుస్తుంది' ఇది తథ్యమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి బెయిల్ మంజూరైన సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు నుండి ర్యాలీ నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం నుండి 108 కళశాలతో ర్యాలీ నిర్వహించి, శివాలయంలో అభిషేకం చేశారు. 108 టెంకాయలు కొట్టి అభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారెడ్డి, ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ నాగేంద్రరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీలో వైసిపి శ్రేణులు

అదుపు తప్పి కింద పడిన ఎమ్మెల్యే : వైసిపి శ్రేణులు ర్యాలీ చేస్తున్న సందర్భంగా ఉత్సాహంగా ఎమ్మెల్యే రాచమల్లు కర్రసాము చేస్తూ అదుపుతప్పి కింద పడ్డారు. వెంటనే జైజగన్ అనే నినాదంతో మళ్లీలేచి నిలబడి ర్యాలీలో పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మిస్సమ్మ బంగ్లా సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ స్పందనలో ఎవరైనా వారి సమస్యలపై అర్జీలు పెడితే వెంటనే ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఖాదర్‌బాషా, మున్సిపల్ సిబ్బంది, సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మూడు నెలలుగా అందని జీతం

- 30 ఏళ్లుగా విధుల నిర్వహణ.. ఎలా బతకాలంటున్న సుబ్బమ్మ

ప్రజాశక్తి - ముద్దనూరు

మూడు నెలల నుండి జీతాలు రాకపోతే ఎలా బతకాలని మాసాల్చిగా విధులు నిర్వహిస్తున్న సుబ్బమ్మ ప్రశ్నిస్తోంది. పెండింగులో ఉన్న జీతాలు ఇయ్యండయ్యా అంటూ ఆమె ఉప ఖజానా కార్యాలయ అధికారులను వేడుకుంటోంది. ముద్దనూరు, కొండాపురం మండలాలకు సంబంధించి ఉద్యోగుల జీతభత్యాల బిల్లుల కోసం 1986లో ముద్దనూరు మండల కేంద్రంగా ఉప ఖజానా కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుండి సుబ్బమ్మ మాసాల్చిగా పార్ట్ టైమ్ ఉద్యోగిగా విధుల్లో చేరింది. జీతం రూ.70లతో మొదలై ప్రస్తుతం రూ.20 వేలు వస్తోంది. అప్పటి నుండి 30 ఏళ్ల పైబడి ఇక్కడే మాసాల్చిగా పని చేస్తోంది. ఆమెకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి జీతాలు రావాల్సి ఉంది. జీతాలు రాక పోతే ఎలా పూట గడుస్తుందని సుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. జీతాలు అడిగితే బడ్జెట్ లేదని అధికారులు నిర్లక్ష్యంగా సాకులు చెబుతున్నారని ఆరోపిస్తోంది. సిబ్బంది సమన్వయ లోపం వల్ల బిల్లులు జాప్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంత శాఖలో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు బిల్లులు పెట్టేందుకు జాప్యం ఎందుకో అని ప్రశ్నిస్తున్నారు. బిల్లులు మంజూరు చేయ్యాలంటే జూనియర్ అసిస్టెంట్ చెయ్యి తడపాలంట అని సుబ్బమ్మ ఆరోపిస్తోంది. గతంలో కూడా జూనియర్ అసిస్టెంట్‌పై విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లు బిల్లులు జాప్యం చేస్తున్నాడని పలు ఆరోపణలు చేశారు. ఎస్‌టిఒ ఉన్నా జూనియర్ అసిస్టెంట్ అంతా తానై కార్యాలయాన్ని నడిపిస్తున్నాడని విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఉప ఖజానా కార్యాలయం సిబ్బంది సమయ పాలన, బిల్లులో జాప్యం, సిబ్బంది సమన్వయ లోపం ఇలా విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎన్ని ఆరోపణలు చేస్తున్నా.. ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చర్చిం చుకుంటున్నారు. సుబ్బమ్మ లెటర్ రాసిస్తే బడ్జెట్ ఉంటే జీతాల బిల్లులు పెడతామని ఎస్‌టిఒ డేవిడ్ అన్నారు.

మహిళలకు ప్రాధాన్యతనివ్వడం సంతోషకరం

చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి మొదటి దశలో ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం సంతోషకరమని ఆ పార్టీ మహిళా నాయకులు సునీతమ్మ, రజియా పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మండల టిడిపి పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలో లేకపోవడం వల్ల కుటుంబంలో పెద్దను కోల్పోయినట్లు ఉందన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో మహిళశక్తి పేరుతో వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలు ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ఇలాంటి పథకాలు ప్రవేశ పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జయచంద్రారెడ్డి, వీరభద్ర, జబిబుల్లా, డక్కా రమేష్, లాయర్ రామకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, ఆది, మహమ్మద్, వేమాతోపాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి రోడ్డుకు మోక్షం ఎప్పుడో..!

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె-రాయచోటి రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లె-రాయచోటి రోడ్డు పనులను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వేంపల్లె-రాయచోటి రోడ్డు ప్రధానమైందన్నారు. పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు మంజూరైందని తెలిపారు. కొత్త రోడ్డును వేయాలని పాత రోడ్డును తవ్వి రెండేళ్లయిందన్నారు. ఈ రోడ్డు పూర్తికాకపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంట ప్రయాణానికి రెండు గంటలు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు.

నిలిచిపోయిన పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

ఓట్ల రాజకీయం వైసిపిదే : భూపేష్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యువగళం యాత్ర, బహిరంగ సభ జమ్మలమడుగు ఎమ్మెల్యేకు ఒక చిన్న ట్రైలర్ మాత్రమేనని, పూర్తి సినిమా 2024లో ఉంటుందని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రను, బహిరంగసభను జయప్రదం చేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు, డిఎస్‌పి, జమ్మలమడుగు అర్బన్,రూరల్ పోలీస్ సిబ్బందికి, వ్యాపారులకు, టిడిపి కార్యకర్తలకు, నాయకులకు, దేవగుడి అభిమానులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ పాదయాత్ర జమ్మలమడుగు వస్తానే ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత బహిరంగ సభ ద్వారా వ్యక్తమైందన్నారు. స్థానిక ఎమ్మెల్యే గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడిన తీరు ఆయన ఓటమిని అంగీకరించినట్లే అన్నారు. సొంత కార్యకర్తలే ఎమ్మెల్యేను విమర్శించే స్థాయికి దిగజారిపోయారన్నారు. ఓట్ల కోసం రాజకీయం చేసేది వైసిపినే అని ఆయన పేర్కొన్నారు. దేవగుడి కుటుంబాన్ని ప్రశ్నించే నైతిక బాధ్యత ఎమ్మెల్యేకు లేదన్నారు. పత్రికా ముఖంగా ఆయన మాట్లాడిన తీరు ఎమ్మెల్యేగా అనర్హుడని భూపేష్‌రెడ్డి తెలిపారు. ప్రజా జీవితంలోకి వచ్చాక బాధ్యతగా, గౌరవంగా మాట్లాడాలని హితవు పలికారు. ఎమ్మెల్యే కాకముందు నీకు ఇన్ని టిప్పర్లు ఉండేవా అని ప్రశ్నించారు. కార్యకర్తలకు లబ్ధి చేకూర్చలేని మీరు ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డికి కియా కారు కొనిచ్చారంటే ఎవరన్నా నమ్ముతారాని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే నాలుగేళ్లలో మీ ప్రభుత్వం, మీరు నియోజక వర్గానికి ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు తెలపాలన్నారు. అలాగే రాబోయే తొమ్మిది నెలల్లో ఏం చేస్తారో అదైనా చెప్పాలని పత్రికాముఖంగా కోరు తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జాంబపురం రమణారెడ్డి, పెద్ద పసుపల కొండారెడ్డి, జికె గైబు, కొండాపురం నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు.. లింక్ మరిచారు

సిసి రోడ్ల స్థానంలో చిప్స్ - ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

లింక్ రోడ్లు వేయాల్సిన చోట పరిచిన చిప్స్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని వలసపల్లె రోడ్డులో దాదాపు 8 నెలల క్రితం పోలీస్‌స్టేషన్ మొదలు దాదాపు వలసపల్లె వంక వరకు మునిసిపల్ అధికారులు నూతనంగా సిసి రోడ్డు, మురుగు కాలువ నిర్మించారు. ఇందుకోసం దాదాపు రూ.2.5 కోట్లు ఖర్చు చేశారు. అంతవరకు బాగానే ఉంది. పట్టణంలోనే అనేక చిన్నచిన్న వీధులను కలిపే పొడవైన ప్రధాన రహదారి ఈ ఎర్రగుంట్ల-వలసపల్లి రహదారి. ఈ రహదారి గుండా మూడు కౌన్సిల్ వార్డులు (12,13,14) ఉన్నాయి. అంటే ఆ ప్రాంతంలో ఎంతమంది నివసిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ వీధులలో ఉన్న రహదారులను ప్రధాన రహదారికి అనుసంధానం చేయాల్సి ఉన్నా.. జాయింట్ (లింక్) రోడ్లను మున్సిపల్ అధికారులు మరిచారు. వీధులలోని రోడ్లను ప్రధాన రహదారికి మధ్య సిసి రోడ్లు వేయాల్సి ఉండగా చిప్స్ (కంకర రాళ్లు) వేసి సరిపెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే ద్విచక్ర వాహనాలు జారిపడి అనేకమంది ఆసుపత్రుల పాలైనారని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 15 నుండి 20 వీధులకు సంబంధించి చిప్స్ వేశారని, ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న సిసి రోడ్డు వేయడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతం నుండి వందల సంఖ్యలో రోజు తమ అవసరాలు నిమిత్తం నాలుగు రోడ్ల కూడలికి ప్రజలు వెళ్లి వస్తూ ఉంటారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కడ జారిపడతామేమోనని భయంతోనే వాహనాలను నడుపుతున్నారు. ఇప్పటికైనా చిప్స్‌ను తొలగించి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వీధులను అనుసంధానించేలా సిసి రోడ్లు వేయాలని నాయకులను, అధికారులను స్థానికులు కోరుతున్నారు.

చిప్స్ వేయడం వల్ల ప్రమాదాలు

మా ప్రాంతంలో రోడ్డు, కాలువ వేశారే కానీ.. దానికి అనుకొని ఉన్న వీధులకు సంబంధించిన రోడ్డు వేయకుండా చిప్స్ వేశారు. దీంతో చాలామంది ద్విచక్ర వాహనదారులు కిందపడి ఆసుపత్రుల పాలయ్యారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదు.

- రాజు, స్థానికుడు

నివేదికలు పంపాం

ప్రధాన రహదారులకు అనుకొని ఉన్న వీధులకు జాయింట్ రోడ్డు వేయకపోవడం వాస్తవమే. దానికి సంబంధించి నివేదికలను ఇఇ కార్యాలయానికి పంపాం. వారి నుండి అనుమతులు రాగానే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి తొందరలోనే పూర్తి చేస్తాం.

- సురేష్ బాబు, ఎఇ, ఎర్రగుంట్ల నగర పంచాయతీ

లోకేష్‌కు ఆర్‌టిపిపి కాంట్రాక్ట్ కార్మికులు, భూ నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

యువగళం పాదయాత్రలో భాగంగా జిల్లా పర్యటనలో ఉన్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ప్రొద్దుటూరులో బస చేస్తున్న ప్రదేశం వద్ద ఆర్‌టిపిపి కాంట్రాక్ట్ కార్మికులు, భూ నిర్వాసితులు గురువారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఎర్రగుంట్ల బహిరంగసభలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో కార్మికులకు సగానికి సగం జీతాలు పెంచారని, కానీ ఈ ప్రభుత్వంలో కనీసం ఒక్క రూపాయి కూడా పెంచలేదని వాపోయారు. ఆర్‌టిపిపిలో 600 మెగావాట్ల నిర్మాణం కోసం 434 మంది రైతులు తమ పొలాలను ఇచ్చారని, వారికి పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని భూ నిర్వాసితులు లోకేష్‌తో తెలిపారు. ఇందులో 88 మందికి మాత్రమే పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. 107 మందికి కాంట్రాక్ట్ కార్మికులుగా ఉపాధి కల్పించారని తెలిపారు. ఆర్‌టిపిపికి పునాది వేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఇక్కడే ఏర్పాటు చేయాలని లోకేష్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిపిపి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బాబు, వైస్ చైర్మన్ శ్రీనివాసులు, యూనియన్ నాయకులు రాంప్రసాద్, శివశంకర్, శంకర్, చంద్ర, కుమార్ రాజా, రవి, దస్తగిరి, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతిపత్రమిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, భూ నిర్వాసితులు

మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జాతీయ కీటక జనిత వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని యర్రగుడిపల్లెలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించి, కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీరు నిలువ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. దోమల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమతెరలు ఉపయోగించాలన్నారు. చలి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్ళు నొప్పులు లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో మలేరియా నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్. నాగమణి, ఆశా కార్యకర్త రాజమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న ఆరోగ్య కార్యకర్తలు

గ్రంథాలయంలో పంచతంత్ర కథలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ లో భాగంగా గురువారం విద్యార్థు0లకు పుస్తక పఠనం, కథలు చదవడం, చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చందమామ, పంచతంత్ర కథలు చెప్పించారు. అనంతరం పిల్లలకు సమోసాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠకులు, 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కథలు చదువుతున్న విద్యార్థి

గురుకుల పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలోని జమ్మలమడుగు (బాలురు), కమలాపురం (బాలురు), వనిపెంట (బాలికలు), వేంపల్లి (బాలికలు) మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఆంగ్ల మాధ్యమంలో వివిధ కేటగిరీలోని ఖాళీలను భర్తీ చేయడానికి ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని కన్వీనర్, ప్రిన్సిపల్ కె.వి.ఎస్.రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆయా పాఠశాలల నుండి రెండు ఫోటోలతో ఈనెల 2 నుండి 8వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులకు వనిపెంట గురుకుల పాఠశాలలో ఈనెల 11న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా కేటగిరీలో ఖాళీగా ఉన్న సీట్లు తెలుసుకునుటకు సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలను సంప్రదించగలరన్నారు. వివరాలకు 90104 40416ను సంప్రదించగలరన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణానికి నీటి సరఫరా చేస్తున్న కనుమపల్లి స్కీం పైపులైన్‌కు సంబంధించి రాణితోపు వద్ద గరండల వంక బ్యూటిఫికేషన్‌లో భాగంగా షిఫ్ట్ చేస్తున్నందున శుక్ర, శనివారాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ కళాశాల వెనుకభాగం, ప్రశాంతినగర్, సుజాతహాల్, సుధాకర్‌రెడ్డి కాలనీ, నాగులకట్ట, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, దోబీఘాట్ వెనుక భాగం, అంబకపల్లి మెయిన్ రోడ్డులో అంతరాయం ఉంటుందన్నారు. ఆదివారం యధావిధిగా నీటి సరఫరా ఉంటుందన్నారు. ఏమైనా అత్యవసర నీటి సరఫరాకు ఎఇ శ్రీఏక్‌నాథ్ యాదవ్ సెల్ 88851 05246ను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

'ఫ్యాషన్ షో'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఫ్యాషన్ షో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శిల్పారామంలో నిర్వహించే ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు రూ.500 ఫీజు కట్టి నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే 3వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.00గంటల వరకు ఫైనల్ షో జరుగుతుందన్నారు. ప్రథమ బహుమతి రూ.5,000, ఫ్యాషన్ షో ట్రోఫీ, బెస్ట్ పర్సనాలిటీ, బెస్ట్ వాకప్, బెస్ట్ హ్యాండ్సమ్, పార్టిపేషన్ అవార్డు, పార్టీసిపేషన్ సర్టిఫికేట్ అందజేస్తామన్నారు. పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 95152 59168ను సంప్రదించాలన్నారు.

బాదంపాలు పంపిణీ చేస్తున్న మహమ్మద్

క్రీడాకారులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవిని దృష్టిలో పెట్టుకొని క్రీడా కారులకు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహ మ్మద్ గురువారం మజ్జిగ, పండ్ల రసాలు పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరి షత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నా క్రీడలపై క్రీడాకారులు మక్కువ చూపించడం సంతోషకరమన్నారు. క్రీడలతో విద్యార్థులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. స్నేహ పూర్వక పోటీతత్వం ఉండాలన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని పార్నపల్లి రోడ్డు అంకాలమ్మ దేవస్థానం సమీపంలో డిఎన్ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లే వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి వంతెనకు పక్కన ఉన్న సైడ్‌వాల్ పడిపోవడంతో వంతెన దెబ్బతింది. ఇదే దారిలో ఓ పాఠశాల కూడా ఉండడంతో పిల్లలు ఆ గుంతలో పడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లగేజీ ఉన్న వాహనాలు ఇటువైపు వెళ్లేటప్పుడు వాటిని తిప్పుకునేందుకు ప్రయత్నిస్తే వంతెన కూలిపోతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే వంతెన పక్కన కాలువపై కప్పు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, సైకిల్‌కు స్కూల్‌కు వచ్చే పిల్లలు, ఆసుపత్రికి ఆటోలలో వచ్చే రోగులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై కప్పు ఏర్పాటు చేసి, వంతెన కూలకుండా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న వంతెన